కథానిక

# సామాన్యుడి సామర్థ్యం

"హ రి ణి"

"ఏమిటో ఏం జీవితాలు? తినడం, ఆఫీసు కెళ్ళడం, కుర్చీకతుక్కుపోయి పొద్దున్న పదింటినుంచి సాయంత్రం నాలుగింటివరకూ తెగ రాయడం, మళ్ళీ తినడం, ఆపైన పడుకోవడం. మానవులమై పుట్టినందుకు ఏం మహదాశయాలు న్నాయి? కాకిబ్రతుకూ, కుక్కబ్రతుకూ ఏంజీవితం? మట్లో గలిపిన జీవితం" అనుకున్నాడు విశ్వనాథం. అనుకోవటమే కాదు. అతని మేధస్థానాన్ని వేచి రాపాడుతున్నాయి ఆలోచనలు. పుట్టినందుకు సార్థకం ఏమిటి మనిషి అయాక. వీధిలో బిచ్చగాడూ బ్రతుకుతున్నాడు వాడి కాలంవచ్చేవరకూ. ఆపైనా ఏడ్చే దిక్కుకూడా లేకపోయినా సుఖంగా పోతుందాప్రాణి. తనూ జీవిస్తున్నాడు యంత్రం లాగ. కాకపోతే ఈ జీవుడికి గుండెల్లో నిరతాగ్ని హోత్రం. అనుక్షణం ఏదో ఒక లోపం అనబడే వాయువీచికాహూయమానమైన ఈ జ్వాలితాగ్ని గుండానికి విశ్రాంతిలేదు. ఏదో లోపం, ఏదో బాధ, అందనివాటిని అందుకుందామనే ఆవేదన, అందకపోతే జీవితంమీద తాత్కాలికమైన విరక్తి ఆపైన తిరిగి ఏదో చిన్న ఆశ, ఆ ఆశతో జీవితాంతం మూక ఘోష—అంతేగా సామాన్యుడి జీవితం! ఒకవైపున కోరికల కల్పవృక్షాల్లా మహా ఎదిగిపోయి, విర్రవీగుతూన్న లక్షీమ్రపుత్రుల ప్రతినిధులైన సౌధరాజాలనుచూస్తాడు. మరోవైపు ఒక్క రూపాయి ఖర్చుతో పజిల్‌లో లక్షలార్జించిన అతీత ప్రజ్ఞావంతులపేర్లు చదువుతాడు. ఈసామాన్యుడికివన్నీ పరమాద్భుతాలూ, ఆశ్చర్యాశ్చర్య పరమాశ్చర్య విషయాలూ. నిజం అని నమ్మలేనంత చిత్రానుభూతి. ఆ లక్షాధికారే తనైతే, ఆ పజిల్లో లక్షలు కొట్టేసిన వ్యక్తే తనైతే ఏంచేస్తాడు?... ఊహలు కీలుగుర్రాల్లా ఆకాశయానంచేస్తే తాను అధఃపాతాళానికి క్రుంగిపోతాడు. అదృష్టవంతులంతా తమ పేరు చిరస్థాయిగా నిలిచేందుకు ఎన్నైనా చేయగలరు. కాని తనవంటివాడు ఆఖరికి తన వంశంవాళ్లు సహితం జ్ఞాపకముంచుకుందుకు ఆస్కారం కలిగించలేడు. విశ్వనాథం కంట్లో ఏదో ధూళికణం అత్యంతాత్రంగా అడక్కుండానే ఆవాసాన్నేర్పరుచుకుంది. దాంతో కంటినుంచి నీరు ధారాప్రవాహంగా ప్రవహించింది. ఒక్క కన్నేడవడం ఏమిటీ మరీ అసహ్యంగా! కాని విశ్వనాథానికి మరో విషయం జ్ఞాపకంవచ్చింది. జీవితంలో రెండుకళ్ళూ ఏడవటం అంటూ ఎన్నడూ వుండదు. ఒక కన్ను కష్టాలకి కరిగిపోతుంది. మరోకన్ను దూరంగా మిసుకుమిసుకు మంటూన్న ఆశను చూస్తూ జీవిస్తుంది. విశ్వనాథానికి ఆలోచనల బరువు అతిశయించింది కాబోలు తలనొప్పి నసాళానికంటుతోంది. ఈ ఆలోచించటం అన్నది ఈ యుగపు నడివయస్సువారి లక్షణం కాబోలు. అందుకే బ్లడ్‌ప్రషర్ తీవ్రంగా వుంటోంది. అందులో ఈ మన సామాన్యుడున్నాడే... ఈయన బ్రతుకే ఆలోచన... ఏదో చెయ్యాలనే ఆకాంక్ష. తీరా చెయ్యబోయి మానేస్తాడు. ఇంత పిరికిగుండె లేడికూడా వుండదు. ఏదీ చెయ్యలేడు. ఏదో చెయ్యాలనే కోరికనూ చంపుకోలేడు.

విశ్వనాథంమాత్రం? ఎంత విచారం మనస్సును బాధిస్తూన్నా తన ప్రవర్తనే తనకి పిచ్చిగా కనిపించి నవ్వకుండా వుండలేదు. ఎలాగైనా ఆ సుఖాల చిలక, మాయలఫకీరు, దర్జాలరాయుడు అయిన ముండాభగవంతుడున్నాడే... వాడికి పక్షపాతం మహజాస్తీ... ఈ జాతి మనుష్యులంటే మహా చూపించాడు పక్షపాతం!.....ఓ చూపువాసి డబ్బు కనిపించటం అన్నది మహాఘోరం. అసలు ఉండకూడదు. లేదా వేలకివేలు కనిపించాలి. అంచేతే అటు ఫకీర్లకీ ఇటు లక్షాధికారులకీ కొరగదగిన దేదీవుండదు. సామాన్యుడు రెండు ఘట్టాలూ రుచిచూసి పుట్టేడు. అందుచేతనే లోకంలో ఇంతమంది వికటకవులు తయారయ్యారు! లేకపోతే ధనవంతుల ఏడంతస్థుల లోగిళ్ళలో బుర్రపెట్టి

ఫకీర్ల పూరికొంపల ముంగిళ్ళలో కాళ్ళాపనించి నడిచే ఈ మనిషి వికటకవి కాక మరెవరు? అల నాడు రామకృష్ణుడు నోటి అవకతవకల్నిబట్టి వికటకవయ్యాడు. ఈనాడు మన సామాన్యుడు స్వతహాగా ఆ 'పోశ్చర్'నిబట్టే వికటకవయ్యాడు!

ఈయనగారి గల్లాపెట్టెలో డబ్బు కానీదగ్గర్నుంచీ అర్థశాస్త్రంలో మాల్థూసియన్ థియరీలా, అర్థమేటికల్‌గా పెరిగితే కోరికలనే త్రాచుపాములు జామెట్రికల్ బేసిస్‌లో పెరిగి బుస్సుమంటూ మింగేయడానికొస్తాయి. ఇలాగ ఒకటి రెండు, మూడుప్రకారం పెరిగే డబ్బు ఒకటి రెండు, నాలుగు, ఎనిమిది సంఖ్యల్లో ఎదిగిపోయే కాంక్షా సర్పాల ఒంటికోరకిందకైనా రాగలవా? అంచేతే తికమకలు, కకావికలు, విలవిలలూ, పలపలలూ.

విశ్వనాథం సుమారు పావుశతాబ్దం పైగా కుర్చీ కతుక్కుపోయి ముందున్న ఫైళ్లకి జోహార్లంటే నాటికి నేడు ఖర్చులుపోగా బాంక్ బుక్కులో చూచుకుని దీంతో ఏంచెయ్యాలాఅన్న ఆనందంతో కుమిలిపోయేందుకుగాను మిగిలిన మొత్తం పది హేనువందలు. 'ఏం చెయ్యాలన్న ఆలోచనేం ఖర్మం? ఎద్దులా ఎదిగివున్న ఆడపిల్ల నింట్లోపెట్టుకుని ఇంకా ఆలోచిస్తున్నావూ. ముందావిడగారిని పంపించు, ఆపైన ఆలోచిద్దుగాని!' అంటూ వార్నింగులిచ్చారు సదా పూజనీయులైన వయోధికులూ శ్రేయోభిలాషులూ.

విశ్వనాథం గౌరవనీయుల్ని కించపరచలేదు కాని లోపల కోపం తాడిప్రమాణాన పెరిగింది. 'నాపిల్ల పెళ్ళి సంగతి వాళ్ళకెందుకు? బోడి పెత్తనం బోడి పెత్తనవాని నా సుఖాన్ని గురించి మీరొక కానీకూడా ఖర్చుపెట్టరుగాని నా శ్రేయోభిలాషులు వారంతా...ఏడవండి. నా యిష్టంవచ్చినట్టు చేస్తా' లోలోపల భగ్గున మండిపోయాడు. నిర్లక్ష్యంగా నవ్వుకున్నాడు.

యాభైయోపడికూడా వెళ్ళిపోతూన్నా తనకు మనశ్శాంతన్నది లేశమైనా లేదే! ఎప్పుడూ ఈ కుటుంబం, ఈ పిల్లలూ, వాళ్ళనిగురించి ఖర్చులూ. ఇల్లుకట్టాలని, భూమికొనాలని, మరింకా ఏవో మహదాశయాలు తన కున్నాయి. అదొక మహాపాపం. అటువంటి ఆశయాలు తనకి పెట్టినందుకు దేవుడనే వాణ్ణి నిజంగా ఓవంద గుంజీలు తీయమనాల్సిందే....కాని వాడందుకే కనిపించడు. కనిపిస్తే ఈపాటికి తనలాంటి వారెందరిచేతుల్లోనో హూనమైయుండేవాడే...ఎంత చాతకానివాళ్ళకైనా దేముణ్ణీ, భార్యనీ, తిట్టి వాళ్ళముందు తమ అధికారం చూపించటంమాత్రం బాగా తెలుస్తుంది. విశ్వనాథంకూడా అంతే చేశాడు.

విశ్వనాథం గుండెలు మండిమండి భస్మం అయ్యాయి. ఆ భస్మంలోనే నిశ్చయమనే బూడిద తగిలింది చేతులకి చల్లగా. తను చచ్చిపోయాక తనవాళ్ళు తననిగురించి చెప్పుకుందుకు తానేమీ చెయ్యలేదు. ఇల్లు కట్టించలేదు. భూములు కొనివ్వలేదు. ఎంతసేపూ ఈ సంసార సాగరంలోపడి కొట్టుకోమనే రాసిపెట్టాడా ఛండాలపు బ్రహ్మ. కొడుకులు వాళ్ళు వుద్యోగాల్లోవున్నారు. ఇంక మిగిలింది ఒక్క కూతురు పెళ్ళి. అన్నగార్లుమాత్రం సహాయం చెయ్యలేకపోయారు. కాబట్టి ఇంకనైనా తనకు సుఖం, మనశ్శాంతీ కావాలి. ఇంక జీవించి నన్నిరోజులైనా కోరుకున్నవన్నీ అనుభవించి మరీ చావాలి. గబగబా మెతుకులు నోట్లో వేసుకుని ఆ బస్ స్టాండుదగ్గిర నుంచోలేక సతమతమైపోన్నాడు. తనకి బ్లడ్‌ప్రషర్ వుంది గాబట్టి శరీరాని కేవిధమైన అలసటా వుండకూడదన్నారు డాక్టర్లు. కనక ఏమైనా సరే పది హేనువందలున్నాయి కాబట్టి ఓ కారు కొని జల్సాగా తిరగాలి. సెకెండుహేండుకారు మంచిదే రావచ్చు మొత్తానికి. విశ్వనాథం తన నిశ్చయానికి తిరుగు లేదనుకున్నాడు.

మనస్సులో నిశ్చయం కలగటమేమిటి, విశ్వనాథం కనిపించిన వాళ్ళకల్లా చెప్పేడు ఓమంచి సెకెండుహేండు కారుంటే వాకబు చెయ్యవలసిందని. ఇంకేం, ఈమహాపట్టణంలో సెకెండుహేండేం, ఫర్డు, ఫోర్తుహేండ్లకేం తక్కువ కనక! ఎల్లా విన్నారో ఇద్దరు ముగ్గురు బ్రోకర్లు ఒకటి, తరువాత ఒకటి, ఓ పెద్దకార్ల ఎగ్జిబిషన్ తయారుచేశారు. ఫర్డు, ఫోర్తుహేండుల్నికూడా పక్కా సెకెండుహేండుల్లా చూపించడంలో సిద్ధహస్తులా జాతి వాళ్ళు. విశ్వనాథందగ్గిర డబ్బేదో మూలిగిపోతుందనుకున్నారు. 'చూడండిసార్...డబ్బు తక్కువకి వస్తుందిగదా అని బి.సి మోడల్స్ తీసుకోవా

లనుకోకండి. కొన్నప్పుడు డబ్బు పెట్టినా దిట్టమైన వస్తువులమీద పెట్టాలండి. ఈకారు చూడండి... ఉల్స్‌లీ—1940 మోడల్. ఓనరు అమెరికా వెళ్ళవలసివచ్చి విధిలేక అమ్ముతున్నాడుగాని బుర్ర పోతే అమ్మేవాడండి? అంతా నాలుగువేలు అలా పారేస్తే ఘనమైన వస్తువు మీ గుమ్మంలో నిల్చుంటుంది...'

ఇదీవరస...విశ్వనాధం ఆధాటీకి తట్టుకోలేక ఖండితంగా చెప్పేశాడు. 'ఏమయ్యోయ్. నేనిప్పుడు కారు కొంటున్నానంటే అది టెంపొరరీయూజ్'కి మాత్రమే. నెక్స్ట్ ఇయర్ ఒక్కసారిగా ఓ కొత్తకారే, ఏ ఆస్టినో కొనాలని వుంది. కాబట్టి ఓ వెయ్యికంటే చస్తే పెట్టను' అని.

ఆ తర్వాత ముట్టుకుంటే మూర్ఛపోతాయేమో నన్నంత సుకుమారమైన కార్లొచ్చాయి. విశ్వనాధం ఆలోచించాడు. పదిహేనువందలూ పెట్టాలనుకున్నా డీసారి. ఓకారు అన్నివిధాలా సరిపోయినట్టు కనిపించింది.

'గుమాస్తాకికూడా కారుకొని దానిని 'మైంటైన్' చేసుకునే స్తోమతవచ్చిందే' అని వారూవీరూ రహస్యంగా అనుకున్నట్టు విశ్వనాధం చలించకుండా వుండలేకపోయాడు. తన కష్టార్జితంతో తనయిష్టం వచ్చినట్టు చేయగల అర్హతకూడా తనకు లేదన్నమాట! కానీ అనుకున్నాడు. లోకులుకూస్తే తనకు లెక్కలేదనుకున్నాడు. తన నిశ్చయం ముమ్మాటికీ నిశ్చయమే ననుకున్నాడు. సరే అనుకున్నాడయ్యా అదే జరిగితే బ్రహ్మ మాటామ్మల్లే సర్దుకుని పద్మాసనానికి ఉద్వాసన చెప్పొచ్చు. ఈ సాక్షాత్తూ సామాన్యుని జీవితంలో నిశ్చయాలకి తిరుగులేదనుకోటం ఎంత నిజమో, ఆ నిశ్చయాలంత తప్పనిసరిగా తిరిగిపోడంకూడా అంత సహజమే. అదే అతని జీవితానికొక విశిష్టత నాపాదిస్తుంది.

ఎప్పుడో ఎవరో ఓ పెళ్ళిళ్ళ పేరయ్యతో కూతురికి సంబంధం చూడమని విశ్వనాధం చెప్పిన చెప్పినమాట వాస్తవమే. కాని ఆ పేరయ్యని ఇప్పుడే తీసుకురమ్మని చెప్పాడాతను? కాని అది దైవనిర్ణయం. దానికి తిరుగులేదు. ఆ నిర్ణయం ముందు తన తిరుగులేని నిశ్చయాలెన్ని తిరుగుళ్ళు తిరిగి ఎన్నివలయాలు చుట్టాలో! ఓ వారం రోజుల్లో ఆ పెళ్ళికొడుకు గ్రహం వస్తాడనీ, బహుశా నిశ్చయం కావచ్చుననీ కొత్త ఆశలు చూపించాడా పెద్దమనిషి. దాంతో ప్లేటు ఫిరాయించింది పాటి బదలాయించింది. అయినా ఏవిటో తనకి కారేవిటీ? ఏవిటో పిచ్చి అభిలాష! విశ్వనాధానికి ఆ ఫోర్సులో తప్పిస్తే మరి తన జన్మలో కారుకొనుక్కొని తిరిగే ఆశలేదని ఓమూల బాధిస్తున్నా కూతురు పెళ్ళైనా అవుతుందేమోనన్న సంతృప్తి కలిగింది. ఈ పదిహేను వందలూ దానికి మింగబెడితే—తొందరలోనే కావచ్చు కూతురు పెళ్ళి—మళ్ళీ అప్పెక్కడ ముట్టెత్తడం? ముట్టెత్తినా ఏంచూసి ఇస్తారు అప్పు, వందలు? విశ్వనాధం మరి ఆ బ్రోకరుగాడి నేదో విధంగా మభ్యపెట్టి ఉచ్చులోంచి బయటపడాలిగా! అబద్ధం ఆడేశాడు. "వెధవ తుక్కుకార్లని తెచ్చి చూపిస్తున్నావ్...దానికి స్టీరింగు బాగో లేదు. దీని హారన్ మోత అంత గార్ధభస్వరంలా వుందే? చక్రాలు తుక్కుతుక్కుచేసి పారేశారు కదా... ఈ మిషనేమిటి ఇంత ధ్వని చేస్తోంది!... అబ్బ, కూచుంటే గుచ్చుకుంటాయి కాబోలు వెధవ సోఫాలు... ఈ కారు గుమ్మంలో వున్నంత దరిద్రం మరోటి వుందా?'...అంటూ ప్రారంభించాడు. ఆఖరికి విసిగిపోయి ఈ ముఖం కొనే ముఖంలా లేదని నిర్ధారించుకున్నాడులావుంది... ఆ బ్రోకరు చడీ చప్పుడూ లేదు. బ్రతికాననుకున్నాడు విశ్వనాధం.

పెళ్ళివారొచ్చారు. పిల్లను చూసుకున్నారు. మహామర్యాదగా మాట్లాడేరు. కట్నంకానుకలంటే తమకంత పట్టింపు లేదన్నారు. విశ్వనాధం ఉబ్బిపోయాడు. పెళ్ళి ఫిఫ్టీపర్సంట్ పైసలా అయినట్టే అనుకున్నాడు. కారుకొనలేదు కాబట్టి సరిపోయింది. ఎంతప్రమాదం తప్పిపోయింది అనుకుని బ్రహ్మానందపడ్డాడు.

వారం తిరిగింది. పెళ్ళివారికి పిల్ల నచ్చిందిగాని ఎందుకో ఇష్టంలేదట!' వార్త...విశ్వనాధం కుప్ప కూలిపోయాడు. మనస్సు వికావికలై పోయింది. దాంతోపాటు కోపం, అహంకారం హిమాలయ శిఖరాలంత ఎత్తున విజృంభించాయి. అయినా ఏమిటి తను ప్రతీదానికీ అంత బ్రహ్మాండం అంత

ఎత్తున పొంగిపోతాడేం? ఉవ్వెత్తుగా లేచిన తరంగం 'దభే'లని కింద పడకుండా వుంటుందా తనపిచ్చిగాని! సరేలే అయినప్పుడే అవుతుంది పెళ్ళి అనుకుని ఊరడించుకున్నాడు మనస్సుని.

ఆ మధ్య స్నేహితు లెవరితోనో అన్నాడు తను కారు కొందాం అనుకున్నట్టు. స్నేహితు లన్నారుకదా...! కారెందుకులేవోయ్ పెట్రోలుకి వందలు మింగేస్తుంది. ఆ మధ్యనేదో ఇల్లు కట్టాలని అనుకుంటున్నట్టు విన్నాను. నారాయణగూడా హిమాయత్ నగర్ రోడ్డుంది చూశావూ! ఆ రోడ్డులో పహాన్‌ప్లాట్స్ అమ్ముతున్నారుటోయ్... ఈ రోజుల్లో అందులోనూ సిటీకి నడిబొడ్డున భూములు దొరకటం ఎంతకష్టమో... కొన్నావూ అంటే ఆఖరికి దుకాణాలు కట్టి పారేసినా రెట్టింపు లాభం. కట్టకపోతే మానె, ధరలు నిమిషాలమీద ఎదిగిపోతున్నామ్. మరు క్షణంలో అమ్మినా మూడోవంతు లాభం... డబ్బుంటే ఇటువంటి వాటిమీద ఉంటేనూ లాభించేది. ఏందుకోయ్ కారూగీరూ... బ్రహ్మరాక్షసిలా మింగెయ్యటం తప్పిస్తే—

స్నేహితుల మహోపదేశం విశ్వనాథం బుర్రలో కుమ్మరిపురుగులా దొలిచింది రాత్రింబగళ్లు. ఎంతాలోచించాడో, ఎంతాలోచించాడో ... కొననావద్దా, అన్న ఆలోచన తెగలేదుకాని ఈ మధ్యలోగా ఆ యజమానుల్ని, ఓ డజను సార్లైనా చూసివుంటాడు. ఇంక ఆ 'ప్లాట్' కళ్ళల్లో ఆడని నిమిషమేలేదు. రాత్రింబగళ్ళందులోనే ఉందతని జీవవిహంగం. కోరినప్పుడల్లా అందులో వ్రాలేదు, నలువైపులా ముచ్చటగా చూసుకున్నాడు, ఓవేళ ఇల్లు కడితేగిడితే ఎక్కడ, ఏ విధంగా ఏమే అరేంజిమెంట్లు చేసుకోవాలో దగ్గర్నుంచి గృహ గోష్టిలో చర్చనీయాంశాలుగా సాగిపోయాయి. ఆఖరికి ఓ పహాన్‌ప్లాటేనా కొని పారేస్తే తనపేరు చెప్పుకుని, తన కొడుకులైనా ఓ ఇల్లు వేసుకోగలరేమో..!తనకాభాగ్యం ఏలాగూ లేదంటుంది మనసు. కాని సంవత్సరాలుగా సొంత స్థలంలో సొంతయింట్లో ఆఖరికి పూరిపాకైనా సరే స్వతంత్రంగా జీవించాలని విశ్వనాథం అణువణువునా ప్రతిధ్వనించే, రక్తంలో స్పందించే కోరిక! స్థలం అంటూ కొంటే ఓ గదైనా వేసుకుని అందులో వుండగలడేమో... విశ్వనాథం మనస్సు పీచుపీచుమంది. కాని తన దగ్గిరున్న మొత్తానికి మరోవెయ్యి ఆఖరికి ఏడెనిమిదివందలైనా అదనంగా కావాలి. కొంటూ మరీ చిన్నదేం బాగుంటుంది? ఎప్పటికైనా ఉపయోగించేదిగా ఉండాలికదా! కూతురి పెళ్ళికోసం ఉన్న ఎకరంలో ఓ అరెకరం భూమి బేరంపెట్టేడో సంవత్సరంక్రితం బంధువుకే, దాని బాపతో వెయ్యి రావాలి. ఆ పెళ్ళీకాలేదు ఆ రూపాయలూ రాలేదు. విశ్వనాథం అర్జంటుగా ఆ వెయ్యీ పంపాల్సిందంటూ అతనికి రాసేడు. అంత త్వరలో అవేనా వస్తాయని పూర్తి నమ్మకంలేదు. ఎవర్నడగాలా అని తహతహలాడి పోయింది మనస్సు. ఓ డాక్టరు స్నేహితుడి దగ్గరన్నాడు ఆ విషయం.

ఇదుగో, విశ్వనాథం, నీ శ్రేయస్సుకోసం చెప్తున్నాను వింటేమంచిది. ఎందుకోయ్! నీకీకాని తహతహ? అందులో నీ శరీరస్థితికూడా ఏం బాగు లేదు. మనస్సుకు విశ్రాంతి కావాలోయ్ చాలా. ఏవైనా డబ్బుందన్నావూ నిక్షేపంగా బాంక్‌లో వేసివుంచుకో ఖర్చుచేసే అవసరాలే రావంటావా? నా మాటవిని ఎక్కువగా ఆలోచించకు సుమా! మెదడుకు ప్రమాదం అన్నాడు డాక్టరు.

మళ్ళీ ఈ మాటల్లోకూడా ఎంతోనిజం కనిపించింది విశ్వనాథానికి. రక్తపుపోటు ఉధృతంగా అవుతూన్న లక్షణాలూ తలనెప్పీ వగైరా కనిస్తున్నాయి. వెధవ ఊగులాటలూ మానేస్తేనే బాగనిపించింది. బంధువు దగ్గర్నుంచికూడా అప్పట్లో సర్దలేననే దీనపు టుత్తరంకూడా వచ్చేసింది. ఇంకేం? పీడావదిలిందనుకున్నాడు విశ్వనాథం .. కాకపోతే ఘరాణాగా కూర్చోగలరా తనవంటి కష్టసుఖాలెరిగిన సామాన్యులు? భార్య అంది. 'అవన్నీ ఎందుకాలోచిస్తారండీ!...ఎన్నో రోజులాయె ముచ్చట పడుతున్నాను. చంద్రహారాలు చేయించుకోవాలని...ఆమాత్రం చెయ్యకూడదూ' అని. విశ్వనాథం నవ్వుకున్నాడు. తలచినవి ఏమవుతున్నాయికనక! సరేలే 'చూద్దాం' అని మాత్రం అన్నాడు.

సరిగ్గా మర్నాడుదయంబండిలో దిగాడు చిన్న కొడుకు హఠాత్తుగా. సంగతేమిటీ అంటే ఇంకే

ముందీ? "కాష్‌తో పనున్న పోస్టులోకి ట్రాన్సఫరు చేశారు నాన్నా! అంచేత ఓ వెయ్యిరూపాయలు డిపాజిటు కట్టాలిట. నాదగ్గిరో అయిదువందలు న్నాయి. మిగతాది నువ్వు తప్పనిసరిగా సర్దాలి నాన్నా ... సెమ్మదిమీద పంపిచేస్తాను" అన్నాడు ముఖం వేలవేసి. విశ్వనాథం ఆశ్చర్యంగా తనను తాను చూసుకుని పక్కన నవ్వేశాడు... ఇంకా మరోవిషయం చెప్పాడు కొడుకు. "ఏదోజాతీయ ప్రణాలికల ఋణం అంటూ కంపల్సరీగా ఓ రెండు వందలేనా కట్టాలిట. రూల్సు వచ్చాయి ఆఫీసు లకి,మీకింకా రాలే?"అని...ఇంకేం భేషుగ్గావుంది. "అలాగే పట్టుకెళ్లు, పంపించడంమాట తర్వాత' అని మాత్రం అనగలిగేడు విశ్వనాథం అదెలాగూ. అసంభవమని ఎరుగును కనుక.

కొడుకు వెళ్ళిపోయాక భార్యదగ్గరన్నాడు ముద్దుగా—"చంద్రహారాలు చేయించమంటావే పెళ్ళామా?"అని..."అదేంకర్మం ఒళ్ళంతా బంగారంతో మలామా చేయించండి. ఒద్దన్నానుకనకనా" అంది భార్య...

ఇద్దరూ నవ్వుకున్నారు. ఈ సామాన్యుని సారధ్యంలో రోడ్డు అద్భుతమైన గతుకుల రోడ్డు. వాటినీ నవ్వుతో పూడ్చుకుంటూ పోతేనే ప్రయాణం తేలిక. ఏడ్చేదానికి కూడా నవ్వుపు పోడంలోనే ఈ జీవితపు మాధుర్యం!

---

స్కెచ్

# ఎదురుతిరిగిన చిలక

మధిర భానుమూర్తి

ఆవధాని చిన్నప్పటినుంచీ ప్రపంచాన్ని శ్రద్ధగా పరిశీలించాడు. మనుష్యుల ప్రవృత్తులను బాగా అర్థం చేసుకున్నాడు. అన్నిరకాల మనుష్యుల్నీ బాగా పరిశీలించి వారు అలా తయారవటానికి కారణాలు బాగా అవగాహన చేసుకున్నాడు. చదువుకున్న వాడు. చాలా విషయాలు గ్రహించిన వాడు అయిన కారణంగా అతనికి కొన్ని అభిప్రాయాలు ఏర్పడ్డాయి.

ఉత్తమ ఆదర్శాలులేనివాడు అసలు మనిషే కాదని అతని అభిప్రాయం. ఆదర్శాలే మనిషిని వృద్ధిలోకి తీసుకువచ్చేవి. ఆ ఆదర్శాల సాధనలోనే ఆనందంఉంది. కనక ప్రతివాడికీ ఆదర్శాలు అవసరం అంటాడు. తను జీవితకాలంలో ఎన్నో విషయాలను సాధించాలని నిశ్చయించుకున్నాడు. వాటిల్లో పిల్లల పెంపకం ఒకటి. దీన్నిగురించి తీవ్రంగా ఆలోచించేవాడు. పిల్లలు బాగుపడ్డా, చెడిపోయినా పెద్దలవల్లనే నంటాడు. చిన్నప్పుడే వాళ్ళని అదుపులోపెట్టకపోతే పెద్దయాక వాళ్ళసలు లొంగరని అతని నమ్మకం. బాల్యంలో వారికి ఏయే విషయాల్లో అభిరుచి కల్పిస్తే పెద్దవారయాక వాటిల్లో ఉత్తీర్ణులవుతారు. ఆ బాధ్యత చాలవరకు తల్లిదండ్రుల మీదనే ఉందంటాడు. తన మేనల్లుడు కొంచెం అల్లరి చిల్లరగా తిరగటానికి కారణం. తనచెల్లెలు బావమరిది వాడికి యివ్వకూడనంత స్వేచ్ఛ యివ్వటమేనంటాడు. అలాగే స్వేచ్ఛ ఎక్కువై పాడయిపోయిన వాళ్ళనెందరినో గురించి చెప్పగలడు అవకాశం దొరికితే. ఇంతటి అనుభవం ఉంచుకుని తను ఆ నిర్ణయానికి వచ్చాడు. తనపిల్లల్ని ఎల్లా పెంచాలో ముందే బాగా ఆలోచించి పథకం ఒకటి తయారు చేశాడు.

అతనికి ఒక కొడుకు. పేరు రంగనాథం. ఆ కొడుక్కి అందరిలాగా గారం అలవాటుచెయ్యటం అతనికి సుతరామూ గిట్టదు. అందుకని అవసరమైనప్పుడల్లా—అంటే ఆ పిల్లాడు ఫలానా వస్తువు కావాలని మారాంచేసినప్పుడల్లా—వాడికి నాలుగు తగలనిచ్చేవాడు. తను ఒక పద్ధతిప్రకారం వాణ్ణి వృద్ధిలోకి తీసుకురావాలని చూస్తుంటే వాడే ఆ కృషికి ప్రతిబంధకమవటం అతను సహించలేక పోయేవాడు. అంత చిన్నకుర్రవాడిని పట్టుకుని అలా కొట్టడం ధర్మంకాదని ఆ తల్లి బెదురుతూనే చెప్పింది. అతనికి మాత్రం అది నచ్చ